శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

# యుద్ధకాండ

## మందర మకరందం

వక్త ఆంధ్రవాల్మీకి - కవిసార్వభౌమ శ్రీ వాసుదాసస్వామి అనువక్త - వాచవి వనం జ్వాలా నరసింహారావు



దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

# యుద్ధకాండ మందరమకరందం

వక్త
ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ
శ్రీ వాసుదాసస్వామి
అనువక్త–వాచవి
వనం జ్వాలా నరసింహారావు


ప్రథమ ముద్రణ

జనవరి 2020

ప్రతులు 1000

వెల: రు. 400

ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్ : **శ్రీనివాసరావు త్రిపురాన**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్,**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:
**మరుమాముల వెంకట రమణ శర్మ**
సంపాదకులు,
**దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక**
Sri Rama Siddhanthi Bhavanam, 29-105/4/1,
న్యూ విద్యానగర్, నేరెడ్‌మెట్, సికింద్రాబాద్–5000 56
ఫోన్: 94410 15469

# శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం...
# యుద్ధకాండ

శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు."చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకులవారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశ లవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ-జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య-వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని-అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ-పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మధనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన–అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం–మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ–పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది–ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్ధ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప

## సర్గ-1
# హనుమంతుడిని ప్రశంసించిన శ్రీరాముడు

(సుందరకాండలో సీతాదేవి రామచంద్రుడిని ఏ ఉపాయంగాను, ఉపేయంగాను గ్రహించడం గురించీ, పారతంత్ర్యం, సీతాపురుషకారం గురించీ చెప్పడం జరిగింది. ఇలా తమను ఉపాయంగానూ, ఉపేయంగానూ గ్రహించినవారిని ఎలా సీతారాములు అనుగ్రహిస్తారో ఈ యుద్ధ కాండలో చెప్పడం జరుగుతుంది. సుందరకాండలో ప్రపన్నుడికి తన విషయమై భగవాదాశయం తెలియచేసి, భగవంతుడు తనను రక్షిస్తాడని, భయపడవద్దని చెప్పి, వాడి విషయంలో వాడు భగవంతుడిమీద ఎంత నిష్టతో వుండాలో, భగవంతుడికి తెలియచేయడం చెప్పడం జరిగింది. యుద్ధకాండలో ఆచార్యుడు ప్రపన్నుడిని రక్షించడం కోసం భగవంతుడిని ప్రేరేపించి ఆయనతో అతడిని రక్షించబడేట్లు చేయడం చెప్పబడుతుంది. సుందరకాండలో గురువుతో బోధించబడిన యోగి మనస్సు ఆత్మాన్వేషణలో ఆసక్తమై సంసార సాగరంలో కలిగే విఘ్నాలన్నింటినీ దాటి దేహాన్ని, ఆత్మను వెతికి, కనుక్కొని జీవాత్మ-పరమాత్మలకు గల సామ్యభేదాలను విమర్శించి, దేహానికి చిక్కుపడకుండా దాన్ని దహించి భగవంతుడి దగ్గరకు చేరడం వివరించడం జరిగింది. యుద్ధకాండలో జీవాత్మ-పరమాత్మలకు ఐక్యం సంపాదించి తాను శెలవు తీసుకోవడం చెప్పడం జరుగుతుంది. ఇందులో ప్రథమంలో భృత్యుడు కార్యాన్ని నెరవేర్చి వచ్చిన తరువాత యజమానుడాభృత్యుడి విషయంలో ఎలా ప్రవర్తించాల్నో చెప్పడానికి సీతవార్త తెచ్చిన హనుమంతుడిని సుగ్రీవాదుల ఉత్సాహానికొరకు రామచంద్రమూర్తి పొగిడాడు).

వానర శ్రేష్టుడైన హనుమంతుడు సీతావిషయంలో లంకలో జరిగినది

జరిగినట్లే చెప్పగా రామచంద్రమూర్తి విని, సంతోషించి, బదులుగా సుగ్రీవుడిని చూసి ఇలా అన్నాడు. "మన హనుమంతుడు చేసిన గొప్ప కార్యం మరెవరూ తాను చేయగలనని నోటితో చెప్పడమే కాదు, మనస్సులో అనుకోవడానికి కూడా శక్తికి మించిన పని. మిక్కిలి దుర్లభమైంది. అలాంటి కార్యాన్ని హనుమంతుడు చక్కగా నెరవేర్చి వచ్చాడు. ఇతడికి సమానమైనవాడని చెప్పగలవాడు ఈ లోకంలో ఎవరైనా వున్నారా? లేదు...లేదు....లేదు. ఈ హనుమంతుడు కాకుండా, గమన వేగానికి ప్రసిద్ధులైన గరుడానిలులు కాకుండా, మరెవ్వరికైనా ఆ సముద్రాన్ని దాటడం సాధ్యమయ్యేదా అని ఆలోచిస్తే ఒక్కడైనా అంతటివాడు ఆలోచనకు రాలేదు. సుగ్రీవా! లంకానగరాన్ని దేవతలకు, యక్షులకు, రాక్షసులకైనా దూరం నుండి దొంగతనంగా పొంచి చూడగలగడం తప్ప, యథా దృష్టి సారించి చూడడం సాధ్యం కానే కాదు. పదితలల రావణుడు పాలించే లంకను మరెవరూ, ఎంతటివాడైనా తన బలసంపదతో ప్రవేశించడం సాధ్యమా? ఒక వేళ రాక్షసులను ఏమరచి లోపల ప్రవేశించినా మళ్లీ ప్రాణాలతో తిరిగిరావడం సాధ్యమా? అలా చేయగలగడం మన హనుమంతుడికి ఒక్కడికే చెల్లింది".

రాముడు సుగ్రీవుడితో ఇంకా ఇలా అన్నాడు. "ఏమయ్యా! హనుమంతుడితో సమానమైన బలం, విక్రమం కలవారు లోకంలో లేరా అంటావేమో? ఒకవేళ వున్నా, అన్ని విషయాల్లో అంటే వేగం, బుద్ధి, దృష్టి లాంటివాటిలో, వాయునందనుడితో సమానమైన వాడు కాకపోతే, రాక్షసులు కాపాడుతున్న, దర్శించడం సాధ్యంకాని లంకను, హనుమంతుడు ప్రవేశించిన విధంగా ప్రవేశించడం సాధ్యమయ్యేదా? సుగ్రీవుడి లాంటివాడి భృత్యుడు ఎలా కార్యం చేయాలో అలాగే అమితమైన పొగడ్తకు తగ్గవిధంగా సీతాన్వేషణ కార్యాన్ని నెరవేర్చాడు హనుమంతుడు. అంతమాత్రమే కాదు. సుగ్రీవుడి యోగ్యతకు తగ్గట్లు తన అతిశయమైన శక్తికి తగినవిధంగా బలాన్ని కూడా చూపించి రాక్షసులను వధించి లంకాదహనం చేశాడు. యజమాని చేయడానికి చాలా కష్టమైన పనిని చేయమని ఆజ్ఞాపిస్తే, తనకింత కష్టమైన పని వచ్చిందికదా అని మనసులో బాధపడకుండా, తాను ఈ పని నెరవేరుస్తానని విశ్వాసంతో కదా, తనకీపని అప్పచెప్పిందని భావించి, భక్తితో యజమాని చెప్పిన పనిని చేయడమే కాకుండా, ఆ పనికి సంబంధించిన ఆయన చెప్పని మిగతా కార్యక్రమం కూడా నెరవేర్చే దూతను బుద్ధిమంతులు పురుషోత్తముడు అంటారు. ఇది ఉత్తమ దూత

# సర్గ-9
# విజృంభించి మాట్లాడిన రభసాదులు

ఆ తరువాత యజ్ఞహుడు, నికుంభుడు, రభసుడు, మహాపార్శ్వుడు, రశ్మికేతువు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, మహోదరుడు, అగ్నికేతుడు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, అతికాయుడు, విరూపాక్షుడు, ధూమ్రాక్షుడు, దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడు....ఇలా అందరూ మాట్లాడారు. వీరంతా నికుంభుడి మార్గం అనుసరించి అలాగే చేయాలని అనుకుని తాను ముందంటే తాను ముందని వారి-వారి ఆయుధాలు పట్టుకుని విజృంభించి ఎగిరిపడుతూ కోపంతో మండిపడుతూ రాక్షసశ్రేష్టుడితో అలాగే అన్నారు. ఇలా అయుధాలు ధరించి పౌరుషపు మాటలు పలుకుతున్న వారిని ఆపుచేస్తూ విభీషణుడు అన్నకు నమస్కారం చేసి ఇలా అన్నాడు.

**రావణుడికి రాజనీతిని తెలియచెప్పిన విభీషణుడు**

"రాజనీతిలో కార్యం సాధించడానికి సామ, దాన, భేద అనే మూడు ఉపాయాలున్నాయి. ఈ మూడు ఉపాయలతో కార్యం సాధించలేకపోతే అప్పుడు దండమనే నాలుగో ఉపాయం అవలంభించాలని నీతిశాస్త్రంలో పండితశ్రేష్టులు చెప్తున్నారు. మొదటి మూడు ఉపాయాలను ప్రయత్నించకుండా యుద్ధానికి దిగడం శాస్త్రవిరుద్ధం. మనవారు యుద్ధాన్ని పొగుడుతున్నారు కదా? ఎవరితో యుద్ధం చేస్తే గెలుపు లభిస్తుందని శాస్త్రం చెప్తున్నదో విను. రాజ్య కార్యాలమీద ప్రీతి లేకుండా వున్నవాడి మీద, ఇంద్రియ సంతోషం మీద ఆసక్తికలవారి మీద, దైవ సహాయం లేనివారి మీద, పిల్లల మీద, పిరికి వాళ్ల మీద, కార్యాకార్యం విమర్శించి యుద్ధం చేస్తే జయం తప్పక కలుగుతుంది. మనస్సునందైన

రాముడు ప్రమాదంలో వుండేవాడు కాదు. ఎలాగైనా జయించాలనుకునే వాడు. యుద్ధంలో ఆయన్ను కన్నెత్తైనా చూడడానికి సాధ్యపడదు. నివారింపకాని పరాక్రమవంతుడు. కోపాన్ని జయించినవాడు. నిష్కారణంగా కోపం తెచ్చుకోడు. ఇలాంటి రామభద్రుడిని పరాక్రమంతో జయించడం ఎలా సాధ్యం? భయంకరమైన నదులను, సముద్రాన్ని దాటి ఒక్క కోతి ధైర్యంతో అసాధ్య కార్యం చక్కచేసుకుని పోతుందని మనస్సులోనైనా ఎవడైనా అనుకున్నాడా? ఏమి ఆశ్చర్యం? వానరాధిపతైన సుగ్రీవుడు రాముడికి తోడుగా వున్నాడని విన్నం కదా? చూశాం కదా? వానరసేన ఎంతో, ఎలాంటిదో మనకు తెలుసు కదా? కాబట్టి రాముడి సైన్యం లెక్క కట్టలేనిది. పగవారి పౌరుషం గట్టిగా వుంది. ఇలాంటప్పుడు శత్రువులను అలక్ష్యం చేయవచ్చా? మీరు రాక్షస వీరులేనా? మనమే వీరులం, ఇతరులు కారని అనవచ్చా?"

"ఏ విషయంలో వారు మీకంటే తక్కువో చెప్పండి. రాముడిమీదకు యుద్ధానికి పోదామని అంటున్నారు కదా? కారణం ఏంటి? ఆయన మీకు చేసిన అపకారం ఏంటి? తన దూత చేత మన నగరాన్ని తగలపెట్టించి మనవారిని చంపించాడని అంటారేమో? ఎందుకు ఇలా చేశాడు? ముందు ఎవరెవరికి అపకారం చేశారు? రాముడేమైనా మన రాక్షసరాజుకు అపకారం చేశాడా? ఇతడే కదా ముందు పోయి ఎక్కడో అడవిలో వున్న రాముడి భార్యను అపహరించి తెచ్చాడు. ఇందులో అన్యాయం ఎవరిది? కలహానికి కాలు దువ్వినవారెవ్వరు? ఆయన భార్యను అపహరించడమే కాకుండా, తన భార్యను మరల తాను తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్న రాముడిని తప్పుపట్టవచ్చునా? సీతాదేవి ఇక్కడ లేకుంటే వానరుడు ఇక్కడికి వచ్చేవాడా? అంతపని చేసేవాడా? ఇదెందుకు మీరు ఆలోచించరు? నీ భార్యలను పరులు అపహరిస్తే మీరు వూరుకుంటారా? కుంభీనసిని మధుడు హరించినప్పుడు వాడిమీదకు మీరు యుద్ధానికి పోలేదా? మీరు చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పా?".

"విభీషణా! నువ్వు చెప్తున్నది వాస్తవం కాదు...ఖరాదులను ముందుగా రాముడు చంపడం వల్లే కదా రాక్షసరాజు రాముడి భార్యను అపహరించింది అంటారా? కాబట్టి కలహకారకుడు రాముడే అంటారా? రాముడు ఖరాదులమీదికి దండెత్తి వచ్చాడా? ఖరుడు రాముడి మీదికి దండెత్తి పోయాడా? ఖరుడే కదా పోయింది. తన ప్రాణానికి అపాయం కలిగినప్పుడు వారి శక్తికొద్దీ తమ్ము తాము రక్షించుకొనడం సహజమే కదా? అలాగే తన్ను తాను రాముడు

## సర్గ-12
# రాక్షసులను సంబోధించిన రావణుడు

అప్పుడు రావణుడు సభలో వున్నవారందరినీ కలియచూశాడు. చూసి, సేనానాయకుడైన ప్రహస్తుడితో ఇలా అన్నాడు. "సేనాపతీ!నువ్వు త్వరగా పోయి, నాలుగు రకాలైన యోధులను, వీరులైనవారిని, ఇదివరకంటే ఎక్కువగా కాపలా పెట్టు" అని చెప్పగా అతడు రాజాజ్ఞ ప్రకారం పట్టణం లోపల, వెలుపల, అన్ని ప్రదేశాలలో పట్టణం రక్షించడానికి వేర్వేరు రాక్షసులను వేర్వేరు స్థలాలలో వుండడానికి నియమించాడు.

"రాక్షసేశ్వరా! అన్ని సేనలను అన్ని స్థలాలలో నిలిపాను. భయం లేదు. సందేహం లేకుండా మీ పని మీరు చేయవచ్చు" అని ప్రహస్తుడు చెప్పాడు. రావణుడప్పుడు తాను చేయదల్చుకున్న కార్యం గురించి చెప్పసాగాడిలా.

"రాక్షసులారా! ధర్మం, అర్థం, కామం....వీటిలో ఏది చేయతగింది అని ఆలోచిస్తే ఏది చేసిన కీడు, మేలు, సౌఖ్యం, దుఃఖం, ప్రియం, అప్రియం కలుగునో అని విచారించి మంచి-చెడు నిశ్చయించండి. నాకేది మేలో, మీకేది మేలో నాకు తెలియదా, మిమ్మల్ని అడగాల్నా అని అంటారేమో? నాకు తెలిసినా, తెలియకున్నా ఇంతదాకా మీరంతా చెప్పినట్లే ఏ పనైనా చేస్తున్నాను కదా! దానివల్ల ఏ పనీ చెడిపోలేదు. అన్నీ సానుకూలంగానే వున్నాయి. కాబట్టే ఇప్పుడు కూడా మీ ఆలోచనప్రకారమే పోవాలని అడుగుతున్నాను. ఆ ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, దేవతలు సమ్మతించిన మార్గంలో పోవడానికి మీరు చెప్పినట్లు చేసేకదా నేనీ సంపద పొందాను. మీరు సంపాదించి ఇచ్చింది కాపాడాల్సింది మేరేకదా? ఇప్పుడు నేను మీకు చెప్పబోయేదంతా ముందే

చెప్పాలని నా మనసులో వుండేది. కాని కుంభకర్ణుడు నిద్రపోతున్నందువల్ల చెప్పలేదు. ఆరు నెలలు నిద్రపోయి ఇప్పుడే మేల్కొన్నాడు కదా! కాబట్టి ఇప్పుడు చెప్పుదామనుకున్నాను”.

(ఆరు నెలలు కుంభకర్ణుడు నిద్రపోతే సీతాదేవిని తెచ్చి పదినెలలయింది కదా! ఆరునెలలకు ముందు వాడు ఒకసారి మేల్కొన్నాడు కదా? అప్పుడెందుకు చెప్పలేదు? వాస్తవమేమంటే సీతను తాను తెచ్చిన విషయం రావణుడెవ్వరికీ తెలియకుండా దాచిపెట్టాడు. ఎవరికీ తెలియరాదనీ, తన అంతఃపుర స్త్రీలు మాత్రమే సంచరించే ఉద్యానవనంలో వుంచాడు. కాబట్టి అంతఃపురానికి వచ్చిపోయేవారికి మాత్రమే ఆమె గురించి తెలుసు. ఆడవారి వల్ల విభీషణాదులకు తెలిసింది. హనుమంతుడు బహిరంగ పరిచేవరకు నగరంలో చాలామందికి తెలియదు. ఇంతెందుకు...యుద్ధానికి పోయే భటులకు ఆ యుద్ధం ఎవరితోనో, ఎందుకో కూడా తెలియదు. ఇది రాజనీతే కావచ్చుకాని దుర్నీతి కూడా. రాజనీతి రెండు రకాలు. ఒకటి సునీతి, రెండోది దుర్నీతి. సునీతి ధర్మాన్ని అనుసరించి వుంటుంది. దుర్నీతి ధర్మ విరుద్ధంగా వుంటుంది. రాజులకు ఉభయ నీతుల్లో అధికారం వుంది. ఇతరులకు దుర్నీతిలో అధికారం లేదు).

## రాక్షసులకు సీత వృత్తాంతం చెప్పిన రావణుడు

రావణుడు రాక్షసులతో ఇలా చెప్పసాగాడు. "రాముడి భార్యను,విదేహరాజు కూతురైన సీతను, దండకారణ్యంలో వుండగా తెచ్చాను. ఎందుకు తెచ్చానంటారా....ముల్లోకాలలో వెతికినా అలాంటి అందగత్తె ఇంకొకరు లేరు. ఆమెను నా భార్యగా చేసుకోవాలని భావించి తెచ్చానుకాని ఆమె ఇంతవరకు నా పానుపు ఎక్కడానికి అంగీకరించలేదు. ఆ బంగారు బొమ్మను, అందగత్తెను, చూసినప్పుడు మయుడే దీన్ని సృష్టించెనా అని అనిపిస్తుంది. ఆ సుందరి పాదాలు, ఎర్రటి గోళ్లు, చూడగా-చూడగా మన్మథుడు నన్ను పరాక్రమించి కాలుస్తున్నాడు. సీత నాకు లభించకపోతే నేను మదనతాపంతో చావడం తథ్యం. కాబట్టి నేను బతికుండాలని అనుకుంటే నాకు తగిన ఉపాయం చెప్పండి. ఆ సీతను చూసి నేను మన్మథ వశమైనాను. చక్కటి అవయవసంపద కలిగిన ఆ స్త్రీ ముఖం చూసి రాక్షసులారా! నేను మారుడి వశమైనాను. మన్మథుడి వల్ల కలత చెందిన మనస్సుకలవాడినైనాను. మన్మథుడి దాటికి స్రుక్కిపోయాను”.

“కోతులైనా, రాజకుమారులైనా, భయంకరమైన జంతువులున్న ఈ

## సర్గ–18

# విభీషణుడు గ్రాహ్యుడని కపులకు చెప్పిన శ్రీరాముడు

ఆంజనేయుడు చెప్పిన (న్యాయంతో కూడిన) మంచిమాటలు విన్న రామచంద్రుడు, ఇలాంటి సందర్భాలలో శాస్త్రాలు ఏమి చెప్పాయో, పూర్వులు ఎలా ఆచరించారో, వసిష్ఠాది పెద్దలవల్ల విన్నవాడైనందున, చేయాల్సిన పని చేయడానికి నిశ్చయించుకుని, ప్రసన్నమైన మనస్సుతో వానరులతో ఇలా అన్నాడు. "మిత్రులారా! మీరంతా నా మేలు కోరేవారు. మీమీ అభిప్రాయాలు చెప్పారు. విభీషణుడిని గురించి నా అభిప్రాయాన్ని నేను చెప్తాను. అది మీరు విని ఏది బాగుంటుందని మనం అంతా నిర్ణయిస్తామో అదే చేద్దాం. నిజమైన మైత్రికలవాడుకాని, మిత్రుడిలాగా నటించేవాడు కానీ, సమీపించి వచ్చినా, దూరంలోనే వున్నా, శరణాగతుడిని విడవను. దానివల్ల నాకు మేలే కలుగుతుందా, కీడు కలుగుతుందా అని నెపం పెట్టి శరణాగతుడిని తోసిపుచ్చరాదు. అలా తోసిపుచ్చితే నేను దుష్టులలో చేరుతాను".

ఇలా ఇది తన స్వభావమని రామచంద్రమూర్తి చెప్పడంతో, అలాంటి స్వభావం అపాయకరమైన సాహసమని తలచిన సుగ్రీవుడు భయపడి, నీతిశాస్త్రం ప్రకారం దానిని విమర్శించి, రాముడిది తప్పని అనిపించడంతో, స్నేహభావంతో, వినయంగా ఇలా అన్నాడు.

"రామచంద్రా! విభీషణుడు దుష్టుడని నేనన్నాను. నీ అభిప్రాయంలో అతడు దుష్టుడు కాదని నువ్వన్నావు. అదలా వుండనీ. వీడు దుష్టుడే కాని, శిష్టుడే కాని, ఇతడి వల్ల మనకు కలిగే లాభం ఏమిటి? నా అభిప్రాయం ప్రకారం అతడు దుష్టుడే అయితే అపాయం తప్పదు. నీ అభిప్రాయమే సరైంది అయితే భయం

లేదు. అది అనుభం మీద తెలవాల్సిందే. ఇతడెలాంటివాడైనా ఎవరికేం సహాయం చేయగలడు? తనకు మనవల్ల మేలున్నదని అనుకున్నంత కాలం మనతో వుంటాడు. మేలు లేదనుకోగానే వెళ్లిపోతాడు. తన మేలుకోరి వచ్చాడేకాని నిన్ను, నన్ను ఉద్ధరించడానికి రాలేదు. ఇతడు ఇలాంటి వాడని నాకెలా తెలుసంటావా? ప్రాణాపాయ కష్ట దశలో వున్న తండ్రి సమానుడైన అన్నను వదిలివచ్చినవాడు నిన్ను కూడా అలాగే వదిలిపోడా? నిన్ను, నన్నేకాదు, ఎవరినైనా ఇతడు వదిలేవాడే. ఎవరికీ ఇతడు సహాయం చేయడు. కాబట్టి నిష్ప్రయోజనమైన, అపాయకరమైన కార్యం నువ్వు చేయవచ్చా?".

ఈ విధంగా సుగ్రీవుడు చెప్పగా, ఆయన ధర్మసూక్ష్మం కాని, తన పరమశక్తి కాని, తన శరణాగత రక్షణ వ్రతనిష్ఠ కాని, తెలియక యుక్తివాదన చేస్తున్నాడు కదా అని తనలో తానే నవ్వుకుంటూ, వానరులను, సుగ్రీవుడిని, లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

"లక్ష్మణా! ఈ సుగ్రీవుడు శాస్త్రాన్ని అధ్యయనం చేయకుండా, యోగ్యులైన పెద్దలను సేవించక వుంటే ఇలా సమయోచితంగా మాట్లాడే నేర్పు దృఢపడి వుండేదా? సుగ్రీవా! విభీషణుడు మనదగ్గరకు వచ్చిన కారణం చెప్తావిను. రాజులైన వారిలో ఒక సూక్ష్మధర్మం సుప్రసిద్ధంగా వుంది. అది రహస్య విషయం కాదు. ఏ రాజుల రాజ్యాల పొలిమేరలు కలిసి వుంటాయో, ఎవరొక వంశంలో పుట్టారో, వారు పగవారవుతారు. వీళ్లు, ఇతరులకు కష్టం వచ్చినప్పుడు పరస్పరం ద్రోహం చేసుకుంటారు. విభీషణుడు, రావణుడు జ్ఞాతులు కాబట్టి విరోధులే. ఆ కారణాన వీడు మనదగ్గరికి వచ్చాడు కాని, నువ్వనుకున్నట్లు రావణుడు పంపితే వాడిమీద ప్రేమతో రాలేదు. పాప విచారంలేని మనస్సుకల జ్ఞాతులు తమ వంశంలో పుట్టి, తమ మేలుకోరేవారికి గౌరవం కలిగిస్తారు. ఇది ప్రభువులుకానివారు ప్రభువుల విషయంలో నడిచే విధానం. మన అన్న ప్రభువైతే ఏమిటి? నేనైతే ఏమిటి? అని అన్నకే ఎక్కువ గౌరవం కలిగిస్తారు. అలా వారున్నప్పటికీ, ప్రభువులు మాత్రం ప్రజ్ఞా శౌర్యసామర్థ్యం వల్ల నిర్మలమైన మనస్సుకల జ్ఞాతుల మీద తరచుగా ద్రోహబుద్ధి కలవారై, వీడేవేళకు మనకేం కీడు చేస్తాడోనని అణగతొక్కి వుంచుతారు. అలాంటప్పుడు నిర్మలమైన వారు కూడా తామెంత శుద్ధంగా వున్నప్పటికీ తమను నమ్మడం లేదని కలుషచిత్తులైపోతారు. అలాగే విభీషణుడు నిర్మల మనస్కుడైనా రావణుడు దుష్టుడు కాబట్టి ఇతడిని సందేహించాడు. సందేహించి వెడలగొట్టాడు.

## సర్గ–35
# సీతాదేవిని ఇమ్మని రావణుడికి నీతి బోధించిన మాల్యవంతుడు

వానరులు చేస్తున్న ధ్వనులు దిక్కులు పిక్కటిల్లేట్లు వ్యాపిస్తుంటే, రాముడు లంక ముట్టడించడానికి వస్తున్న విషయం అర్థం చేసుకున్న రావణుడు ఒక్క ముహూర్తకాలం ఏం చేయాల్నా అని ఆలోచించసాగాడు. తన మంత్రులను చూస్తూ, వాళ్లను తిట్టుకుంటూ, బొబ్బలు పెట్తూ, ఇలా అన్నాడు.

"మీరంతా రాజకుమారుడు సేనలతో సహా సముద్రం దాటి వచ్చాడని చెప్తేకదా నాకా విషయం తెలిసింది. సీతానాథుడైన రామచంద్రుడి బలగర్వం విని మీరంతా నోరు మూసుకున్నప్పటికీ, మీరంతా యుద్ధంలో అద్భుతమైన పరాక్రమం చూపుతారని నా నమ్మకం. మిమ్మల్ని నమ్మేకదా సందేహం లేకుండా, ఎంత గొప్ప, కష్ట సాధ్యమైన పనైనా చేయగలిగాను. ఇప్పుడు కూడా మీరు నిండు మనస్సుతో సహాయం చేస్తే నేనీ కార్యం నేరవేర్చలేనా?"

రావణుడు ఇలా అనగానే, అతడి తల్లికి పెదనాన్న అయిన మాల్యవంతుడు ఇలా అన్నాడు. "రాజధర్మం తెలిపే నీతి విద్యల్లో పండితుడై, నీతిమార్గాన్ని అనుసరించే రాజు, ఐశ్వర్యంతో కూడి చిరకాలం రాజ్యం చేస్తూ, శత్రువులను తనకు లోబర్చుకుంటాడు. కాలానుగునంగా శత్రువుతో సంధి చేసుకోవాల్సి వచ్చినప్పుడు సంధి, యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు యుద్ధం చేసేవాడు తన పక్షాన్ని వృద్ధి చేసుకుని సంపద కలవాడవుతాడు. ఎప్పుడు సంధి చేసుకోవాలి, ఎప్పుడు యుద్ధం చేయాలని అడుగుతావేమో? శత్రువు కంటే తనబలం తగ్గినప్పుడు, లేదా, శత్రువు సమానుడైనప్పుడు సంధి చేసుకోవాలి. శత్రువు బలం తగ్గి, తన బలం పెరుగుతుంటే శత్రువులను ఉపేక్ష చేయకూడదు. యుద్ధం

చేయాలి”.

“ఇప్పుడు సంధి చేయాల్నా? యుద్ధం చేయాల్నా అని నువ్వడిగితే నేను చెప్పేది ఒక్కటే. నేను చెప్పేది నీతి పద్ధతి కాబట్టి ఇప్పుడు రాముడితో సంధి చేసుకోవడమే తగిన కార్యం. దానికేమి చేయాలి? రాముడి కాళ్ల మీద పడాల్నా? అంటావేమో! అవసరం లేదు. కలహకారణం సీత. అలాంటి సీతాదేవిని తక్షణమే, వేగంగా రాముడి దగ్గరికి పంపించు. దాంతో పగ ముగుస్తుంది. అంతటితో నువ్వు నిర్భయంగా, నిరపాయ సుఖం పొందగలవు. సీతను పంపగానే యుద్ధం ఆగిపోతుందన్న నమ్మకం ఏంటి అని అడుగుతావేమో? రాముడు తన భార్యను తీసుకుపోవడానికి యుద్ధానికి వచ్చాడేకాని నీ రాజ్యం ఆశించి రాలేదు. కాబట్టి ఆమెను ఇవ్వడంతో పగ, కారణం తీరిపోతుంది. నీ రాజ్యంలో నువ్వు, ఆయన రాజ్యంలో ఆయన సుఖంగా వుండవచ్చు”.

“సంధి ఎందుకు చేసుకోవాలి? యుద్ధం ఎందుకు చేయకూడదు అంటావా? దేవర్షులు, దేవగంధర్వులు, ఎవరికి విజయం చేకూరాలని కోరుకుంటున్నారో అలాంటి రాజకుమారుడితో నీకు విరోధం ఎందుకు? రాముడికి మనకు కనబడే వానర బలంతో సహా దైవబలం కూడా వుంది. బ్రహ్మదేవుడు లోకంలో ధర్మ పక్షమని, అధర్మ పక్షమని రెండు సృజించాడు. దేవతలు గొప్ప బుద్ధికలవారు కాబట్టి ధర్మాన్ని ఆశ్రయించారు. అసురులు, రాక్షసులు మహితాత్ములు కానందున తత్కాలంలో మంచిగా కనిపించే అధర్మాన్ని ఆశ్రయించారు. ఎప్పుడు ధర్మం అధర్మాన్ని అతిశయిస్తుందో అదే కృతయుగం. ఎప్పుడు అధర్మం ధర్మాన్ని అణగదొక్కుతుందో అదే కలియుగం. తన్నాశ్రయించిన వారిని ఉద్ధరించడం ధర్మం గుణం. తన్నాశ్రయించిన వారిని అధోగతి పాలుచేయడం అధర్మ లక్షణం. ఎంతెంత ధర్మం హెచ్చునో అంతంత దాన్ని ఆశ్రయించినవారికి మేలు కలుగుతుంది. ఎంతెంత అధర్మం హెచ్చవుతుందో దాన్ని ఆశ్రయించినవారికి అంతంత కీడు కలుగుతుంది. నువ్వు పరాక్రమం వల్ల ధర్మాన్ని నాశనం చేసుకుని పర్యవసానం ఎలా వుంటుందో లక్ష్యం చేయకుండా అధర్మం సంపాదించావు. నీ అధర్మం నీకు కీడుచేయక మానదు. ధర్మంలో వున్నవారు బాగుపడుతారు. కాబట్టి మన పగవారు మనకంటే బలవంతులయ్యారు. వారివల్ల మనకు కీడు కలుగుతుంది”.

“అధర్మం వల్ల కీడు కలదని నువ్వు గమనించకుండా హెచ్చరిక తప్పి,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Srimadandhra+Valmiki+Ramayanam+Yuddha+Kanda+Mandara+Makarandam**

* * *